క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వీఆర్‌ఓలతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: ఇళ్ల స్థలాల దరఖాస్తుల పరిశీలన, రేషన్ కార్డులు రేషన్ పంపిణీ ప్రత్యేక అంశాలని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. శనివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ గ్రామంలోనూ ప్రజల నుంచి ఈ రెండు అంశాలతో పాటు రెవెన్యూ పరమైన ఏ అంశంలోనూ ఫిర్యాదులు రాకూడదన్నారు. పరస్పర సహకారంతో విధులు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి శాఖపరమైన కృషి అందించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, అన్ని గ్రామాల వీఆర్‌ఓలు ఉన్నారు.

నేడు గోపన్నపాలెంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలోని వేగవరం హేలాపురి సైన్స్ కాలేజీలో ఆదివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు జరుగుతాయని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. శనివారం కళాశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 600మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. అనంతరం పరీక్షల ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, గోపన్నపాలెం విఆర్‌ఓ రంగనాథ్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో శ్రీదేవికి అభినందనలు



దెందులూరు: దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవికి డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. శనివారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి లిఖితపూర్వక ఉత్తర్వులను జారీ చేశారు. ఏవో భీమరాజు అన్ని శాఖల మండల అధికారులు ఎంపీడీవో శ్రీదేవిని అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

దెందులూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాల ప్లస్‌లో కిషోర వికాసంపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విద్యా రంగంలో అభివృద్ధి చెందుతారని తెలిపారు. వైద్యశాఖ సూచనలు సలహాలు పాటిస్తూ వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాల నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఆమె శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో చట్టంతో విభేదించిన బాలలకు–న్యాయం, బాలల రక్షణ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. చట్టంతో విభేదించిన బాలలకు అందుబాటులో ఉన్న పథకాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో పోక్సో స్పెషల్ జడ్జి కుమారి కె.వాణిశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులి కృష్ణ తదితరులు ఉన్నారు.

వదిలేసారా..?

- గ్రామాల్లో ఏరులై పారుతున్న నాటు సారా
- పట్టించుకోని అధికారులు
- వసూల్ రాజాల అండతో వ్యాపారాలు
- వెలవెలబోతున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు



విక్రయానికి బారీ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సారా



బి శింగవరం ప్రదాన కూడలిలో సారా విక్రయిస్తున్న వ్యక్తి



నాటు సారా కాస్తున్న దృశ్యం

పెదవేగి : పెదవేగి మండలంలో నాటు సారా ఏరులై పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నాటుసారా మితిమీరిన విక్రయాల వల్ల ప్రభుత్వ వైన్ షాపుల ఆదాయం లక్షల్లో నుంచి వేలల్లోకి దిగజారిపోయిందని వైన్‌షాపు నిర్వాహకులే రోజువారి ఆదాయం చూసి పెదవి విరుస్తున్నారని తెలిసింది. నాటుసారాను అరికట్టాల్సిన అధికారులే కనుసన్నల్లో పలు గ్రామాలకు నాటుసారాను రవాణా చేస్తున్నారు. రోజువారీ నుంచి నెలవారీ ముడుపులు తీసుకుని వైన్‌షాపుల వ్యాపారాలను నష్టాల్లోకి నెట్టేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వైన్ షాపుల వ్యాపారాలను నిలువునా ముంచెది కొంత మంది సివిల్, ఎక్సైజ్ పోలీసులేనని కొంతమంది రాజకీయ నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. నాటు సారా అమ్మే వారిని పట్టుకుని అరెస్ట్ చేసే అధికారులు సారా అమ్మకందారుల నుంచి ముడుపులు తీసుకునే ప్రభుత్వ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్ని మండలాలలో సారా విక్రయాలను అడ్డుకోవాల్సిన అధికారులు సారా వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేసుకు రావడానికి నమ్మకమైన సిబ్బందినొకరిని వసూల్ రాజా విధులు అప్పజెప్పుతున్నారని కొంత మంది వ్యాపారులు గుసగుస లాడుకుంటున్నట్లు సమాచారం. ఇదంతా జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల్లో జరుగుతుందని విశ్వసనీయ సమాచారం. పెదవేగి మండలంలో తాళ్ల గోకవరం, రామసింగవరం, బాపిరాజుగూడెం, కొప్పాక, అమ్మపాలెం, భోగాపురం, వేగి వాడ, అంకన్నగూడెం, కూచింపూడి, కె కన్నాపురం, కవ్వగుంట తదితర గ్రామాల్లో పట్టపగలే నాటు సారా సారా రోడ్డుపై ఏరులై పారుతున్నా పట్టించుకున్న నాథుడే లేడని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నాటుసారాపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దెందులూరుకు మూడు ఆర్టీసీ సర్వీసుల ఏర్పాటు



దెందులూరుకు ఆర్‌టీసీ సర్వీసులు

సాక్షి స్పందన

దెందులూరు: ఏలూరు నుంచి దెందులూరుకు ఆర్టీసీ సర్వీసులు లేక విద్యార్థుల ఇక్కట్లు శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఆర్టీసీ జిల్లా అధికారులు దెందులూరుకు మూడు సర్వీసులను ఏర్పాటు చేశారు. దెందులూరు నుంచి ఏలూరుకు వివిధ కళాశాలకు వెళ్లే దాదాపు 100 మంది విద్యార్థులు ప్రతిరోజు ఉదయం దెందులూరు నుంచి జాతీయ రహదారి చెక్‌పోస్టు వరకు సాయంత్రం చెక్ పోస్ట్ నుంచి దెందులూరు గ్రామంలోకి దాదాపు నాలుగు కిలోమీటర్లు నడిచి వస్తున్నారు. సాక్షి కథనంతో మూడు సర్వీసులు ఏర్పాటు చేయడంతో కళాశాలకు వెళ్లే విద్యార్థులు తల్లిదండ్రులు దెందులూరు గ్రామస్తులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడం సరికాదు



కత్తుల రవి

దెందులూరు: మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్కాంల కోసం ప్రైవేట్‌పరం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజారోగ్య రంగాన్ని బలిపెట్టేలా చంద్రబాబు రెండు దారుణమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. పేద విద్యార్థులకు మెడికల్ చదువులను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందన్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో 17మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు అన్నదాత పోరు పోస్టర్ విడుదల

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఏలూరు అశోక్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేయడం జరుగుతుందని పార్టీ నాయకులు ఓ ప్రకటనలోతెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ మాజీ చైర్మన్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

సర్వేపల్లి అడుగుజాడల్లో నడవాలి



యోహాన్ మాస్టార్‌ను జ్యోతిరావుపూలే సేవారత్న అవార్డుతో సత్కరిస్తున్న బహుజన నాయకులు

గణపవరం: సర్వేపల్లి రాధాకృష్ణ మహోన్నత వ్యక్తి అని, ఉపాధ్యాయ లోకం ఆయన అడుగుజాడల్లో నడిస్తే విద్యారంగం ఉన్నతమైనదిగా రూపుదిద్దుకుంటుందని ఏపీ బహుజన జేఏసి నాయకులు అన్నారు. బహుజన జేఏసి ఆధ్వర్యంలో గణపవరం మండలం పిప్పరలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యారంగంలో విశేష సేవలందిస్తూ, తన విద్యాసంస్థ ద్వారా నిరుపేద, అనాథ విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న భారతి విద్యాసంస్థ అధినేత నందమూరి యోహాన్‌ను జోతిరావుపూలే సేవారత్న అవార్డుతో సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో బహుజన జేఏసి అధ్యక్షుడు తాళ్లూరి మధు, గౌరవాధ్యక్షుడు కాటం స్టాన్లీరాజు, రాష్ట్రసంఘం అధ్యక్షుడు బిరుదుగడ్డ రమేష్‌బాబు తదితరులు మాట్లాడుతూ యోహాన్ సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో దానం విద్యాసాగర్, పిల్లా శ్రీను, నత్యాల శాంత, బందెల జార్జిరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనాలు



భీమడోలులో ఊరేగిస్తున్న గణనాథుడు



ఉంగుటూరు: కోనేరుపేటలో గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు గ్రామంలోని వినాయక చవితి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిసాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లోని చవితి వేడుకల్లో భక్తులచే పూజలందుకున్న గణనాథుడి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గోదావరి కాల్వలో నిమజ్జం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటి కార్యదర్శి దత్తాడ శ్రీనివాస రాజు, నిర్వాహకులు గంధం భాస్కరరావు, తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, గోపిశెట్టి రమేష్, యర్రంశెట్టి శివ, వెజ్జు శ్రీమన్నారాయణ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, గిరిజాల మల్లేష్, తన్నీరు స్వామి, పి.లక్ష్మణ, దుంగా రమణ, సీహెచ్ వీరబాబు, సవలం శ్రీను, టి. అశోక్, బెల్లం కొండ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి ఊరేగింపులు

ఉంగుటూరు: మండలంలోని గణనాథుడి నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు కోనేరు పేటలో వినాయకుని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అనంతరం కాలువలో వినాయక విగ్రహాలను నిమజ్జనాలు చేశారు.

దెందులూరులో అధ్వానంగా రోడ్లు



అధ్వానంగా ఉన్న దెందులూరులో రోడ్లు

దెందులూరు: మండలంలోని నియోజవర్గ ముఖ్య కేంద్రం దెందులూరులో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన పరిస్థితుల్లో ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోల పరిస్థితి అయితే చెప్పనవసరం లేదు. గోతులు పూడ్చకపోవడం ఇటీవల రెండు నెలలుగా అప్పుడప్పుడు పడినవర్షాలకు వర్షపు నీరు గోతుల్లో నిలిచి పోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొవ్వలి వంతెన నుంచి బిఎస్ఎన్ఎల్ రోడ్డు ఎదుట గ్రామ మాజీ సర్పంచ్ తొత్తడి వేదకుమారి రోడ్డులో చాలా గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి

భీమడోలు: కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలను అందించాలని సీవిల్ జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి అన్నారు. భీమడోలు సివిల్ కోర్టులో ఈనెల 13వ తేదీ శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల పోలీసులు, న్యాయవాదులు, వివిధ శాఖలు, సంఘాల వారితో శనివారం ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కక్షిదారులంతా తమ కేసులను పరిష్కరించేందుకు ఇదే మంచి అవకాశమన్నారు. దీని వల్ల డబ్బు, సమయం కూడా ఆదా అవుతుందన్నారు. మండల పరిధిలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐ యూజే విల్సన్, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబాలో ఎయిడ్స్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరిబా హై స్కూల్‌లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ అమృత, అదనపు డీఎంహెచ్ఓ నరేంద్ర పర్యవేక్షణలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కె.శిరీష ఎయిడ్స్ వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చెడు వ్యసనాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఏఆర్‌హెచ్ ఈడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీష, ఓఆర్‌డబ్ల్యూ జి.రాజేంద్ర ప్రసాద్, ఏఎన్ఎం కె.ప్రభావతి, సచివాలయం స్టాఫ్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



గుండుగొలను ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమడోలు: కౌమర దశలో వచ్చే ఆరోగ్య మార్పుల పట్ల బాలికలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ శోభా అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు ఆరోగ్య సంరక్షణ పట్ల శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి హెచ్ఎం గారపాటి సునీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలను పాటించాలని, రక్త హీనత నివారణ కోసం పోషక విలువలు గల ఆహారాన్ని భుజించాలన్నారు. బాలికలు ప్రత్యేకంగా కౌమర దశలో వచ్చే ఆరోగ్య మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి జాహ్నవిరెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మధుసూధన రావు, ఎంఎల్‌హెచ్‌పీ ఏఎన్ఎంలు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే



నిడమర్రులో మండల ఉత్తమ ఉపాధ్యాయిలను సత్కరిస్తున్న దృశ్యం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

నిడమర్రు: సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే అని, వారి చేతుల్లోనే దేశభవిష్యత్ నిర్ణయించబడుతుందని ఎంపీడీవో విజయ కుమారి అన్నారు. శనివారం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన 7 మంది ఉపాధ్యాయులను నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మండల స్థాయి అవార్డులు అందుకున్నవారిలో షేక్ రంగావలి (తోకలపల్లి), జి. మల్లిఖార్జున రావు (పత్తేపురం), బీఎస్ నరసింహం (అడవికొలను), అడబాల అప్పారావు (నిడమర్రు), ఆళ్ళ సూర్యచంద్రరావు (క్రొవ్విడి), బీబీ మాధురి (పత్తేపురం), బి. రాము (అడవికొలను) ఉన్నారు. వీరిని మండల అవార్డు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–1 టి.అనూరాధ, ఎంఈవో–2 యర్రంశెట్టి శేషగిరిరావు, పూర్వపు ఎంఈవో కె. రాంబాబు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉన్నారు.

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు

భీమడోలు: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు అని శ్రీమన్మహా గణపతి ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు అన్నారు. భీమడోలులో 61వ శ్రీమన్మహా గణపతి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ హెచ్ఎం, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావును ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిని అంకితభావంతో పని చేసి ఎందరో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు యలమర్తి రవీంద్రకుమార్, గౌతమ్‌కుమార్, సత్యేంద్ర, పాలేటి రామకృష్ణ, పెనుమూడి బాలు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, గ్రంథపాలకుడు కె.శ్రీనివాసరావు, పెద్దలు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, తల్లిదండ్రులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భీమడోలులోని శ్రీమాధురి జూనియర్ కళాశాలలో శనివారం కరస్పాండెంటెంట్ కె.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత 30 ఏళ్లుగా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకునిగా పని చేస్తూ వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులను తీర్చిదిద్దిన కఠారి సూర్యచంద్రశేఖర్‌ను వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఆర్.అశోక్, పి.కేసరి, ఇంచార్జి పి.బాలు, వార్డు సభ్యురాలు మామిడిపల్లి కృష్ణకుమారి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు

ఉంగుటూరు: అంకిత బావంతో పనిచేసే ఏ ఉపాధ్యాయుడు అయినా ప్రజమన్ననలను పొందుతారని ఉంగుటూరు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి అన్నారు. శనివారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజ్ మనోజు, డివైఈవో రవీంద్ర భారతి, ఎంఈవో 2 సాయాబాబా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

దెందులూరు: ఉత్తమ సమాజ నిర్మాణం కోసం సేవలందించిన ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులని ఆర్‌సీఎం దెందులూరు చర్చి ఫాదర్ జి అమ్మన్ రాజా అన్నారు. శనివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో దెందులూరు చర్చి పరిధిలో ఉద్యోగ విరమణచేసిన 30మంది ఉపాధ్యాయుల ను ఆయన సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం దేవుడు వారందరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



భీమడోలులో రిటైర్డ్ హెచ్ఎం తుమ్మల ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు



రిటైర్డ్ ఉపాధ్యాయిలను సన్మానించిన ఫాదర్ అమ్మన్‌రాజా

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



గణపవరంలో ఉపాధ్యాయిలను సత్కరిస్తున్న జెడ్పీటీసీ సోమలక్ష్మి

గణపవరం: ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైనదని గణపవరం జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి అన్నారు. శనివారం గణపవరం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈసందర్భంగా జరిగిన సభలో సోమలక్ష్మి మాట్లాడుతూ మారుతున్న కాలానికి, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, వీటికి అనుగుణంగా పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. గణపవరం ఎంఈవో–ప్రభుత్వ రాజేష్, ఎంఈవో– డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. ఈసందర్భంగా విద్యారంగంలో విశిష్టసేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సంపూర్ణ చంద్ర గ్రహణం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేడు ఆకాశంలో సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనుంది. రాత్రి 9.56 గంటలకు గ్రహణ స్పర్శ కాలం ప్రారంభమౌతుందని, రాత్రి 11.41 గంటలకు మధ్యకాలమౌతుందని, అర్థరాత్రి 1.26 గంటలకు మోక్షకాలం అవుతుందని పండితులు వివరించారు. ఈ మేరకు నగరంలోని అన్ని దేవస్థానాల్లో మధ్యాహ్నం స్వామి వార్లకు నివేదనలు సమర్పించిన అనంతరం ఆలయాలను మూసివేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలు దాటిన తరువాత ఆలయాల్లో సంప్రోక్షణలు చేస్తారని, అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతులు ఇస్తారని వివరించారు.